

శివపార్వతుల కల్యాణం

యాదగిరిగుట్టకు అనుబంధంగా ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

- 8లో



ఇద్దరు కూలీలు మృతి

క్వారీ లోపలికి వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరు వలస కూలీలు మృతిచెందారు.

- 8లో



ప్రజలు భాగస్వాములు కావాలి

సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కోరారు.

- 8లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికకు 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

- ఓటుహక్కు వినియోగించుకోనున్న ఉపాధ్యాయులు 2,664 మంది



బ్యాలెట్ బాక్సును పరిశీలిస్తున్న కలెక్టర్

భానుపురి (సూర్యాపేట) : వరంగల్ –ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాల్లో 2,664 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ పి. రాంబాబుతో కలిసి ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన మెటీరియల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ సామగ్రి పంపిణీ, ఎన్నిక నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, పద్మారావు, వేణు, సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు బోనస్ ఇవ్వాలి



అర్వపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

అర్వపల్లి: కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం వెంటనే బోనస్ చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అర్వపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, ఉప్పలయ్య, దేవరకొండ యాదగిరి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి భానునాయక్

నేరేడుచర్ల : విద్యార్థులు కష్టపడి కాకుండా మనస్సు పెట్టి ఇష్టంతో చదివితే అద్భుతాలను సృష్టించవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి భానునాయక్ పేర్కొన్నారు. మంగళవారం నేరేడుచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పర్రెడ్డి వెంకటరమణ, డీఈసీ సభ్యులు జానపాట కృష్ణయ్య, లక్ష్మయ్య, మద్దిమడుగు సైదులు, నెహ్రూ యువజన కేంద్రం స్టేట్ ఆర్గనైజర్ ప్రవీణ్‌సింగ్, దిర్శించర్ల పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



శివరాత్రికి విద్యుద్దీపాలతో ముస్తాబైన సూర్యాపేట మండలం పిల్లలమర్రిలోని ఎరకేశ్వర ఆలయం

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మేళ్లచెరువు : మేళ్ల చెరువు మండలకేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంబు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం తెల్లవారు జామున అభిషేకాలతో ప్రారంభమయ్యాయి. రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ ఉత్సవాలు మార్చి 2వ తేదీ వరకు జరగనున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయం వద్ద క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. విద్యుత్ లైట్లు అమర్చారు. ఐదు రోజుల పాటు జరిగే జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకోనున్నారు. మంగళవారం రాత్రి గ్రామంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభను నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రారంభించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



మేళ్లచెరువు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పాలక మండలిసభ్యులు,అర్చకులు



విద్యుత్ ప్రభను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అటకెక్కిన ‘టీ-ఫైబర్’

- పంచాయతీల్లో అందుబాటులోకి రాని ఇంటర్‌నెట్ సేవలు
- కేబుల్ వేసి, పరికరాలు బిగించి కనెక్షన్ ఇవ్వని సిబ్బంది
- 2017లో పనులు ప్రారంభించినా మధ్యలోనే నిలిచిన పథకం
- కంప్యూటరీకరణ జరగాల్సిన పంచాయతీల్లో ఇంకా రశీదులే గతి



ఈ ఫొటోలో కన్పిస్తున్నవి చిలుకూరు మండలం ఆర్లేగూడెం గ్రామ పంచాయతీలో టీ ఫైబర్ నెట్ పరికరాలు. గ్రామ పంచాయతీ వరకు కేబుల్ వైర్ వేసి ఫైబర్‌నెట్ పరికరాలు బిగించారు. కానీ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో రెండేళ్లగా నిరుపయోగంగా ఉన్నాయి. ఇదీ.. జిల్లాలో ఫైబర్ పథకం పనుల తీరుకు నిదర్శనం.

భానుపురి (సూర్యాపేట) : పల్లెల్లో ప్రజలకు ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులోకి తేవాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు.టీ ఫైబర్ పథకంలో భాగంగా ప్రతీ పంచాయతీలో కేబుల్‌తో పాటు పరికరాలు బిగించి కనెక్షన్ ఇవ్వడం మరిచారు. దీంతో ఈ పరికరాలన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. ఎనిమిదేళ్లవుతున్నా అధికారులు ఈపథకం ఊసే ఎత్తడంలేదు. ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్ ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. ప్రతి పని, సేవలకు తోడుగా టీవీ, సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం ఇంటర్‌నెట్‌తోనే ముడిపడి ఉంది. దీన్ని గుర్తించి ప్రతి పంచాయతీలో ఈ – పాలన, ఇంటింటికీ తక్కువ ధరకే ఇంటర్నెట్ సేవలు అందించాలన్న లక్ష్యంతో 2017లో అప్పటి ప్రభుత్వం టీ–ఫైబర్ సేవలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం నుంచి గ్రామస్థాయిలో పంచాయతీలకు, ప్రభుత్వం నుంచి పౌరులకు సేవలందించాలన్నది ప్రధాన ఉద్దేశం. గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బ్యాంకులు, రైతు వేదికలు, ఇతర ప్రజా సేవల సంస్థలకు అధిక వేగం కలిగిన ఇంటర్‌నెట్ అందించేందుకు మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్లు వేసే సమయంలోనే జీ – ఫైబర్ కేబుల్ వేశారు.

మధ్యలోనే నిలిచిన పథకం...

ఈ పథకంలో భాగంగా ఇటీవల నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలు మినహా అన్నిచోట్లా పంచాయతీ కార్యాలయాల వద్దకు టీ – ఫైబర్ కేబుల్ వేశారు. కార్యాలయాల్లో పరికరాలను సైతం కొన్ని చోట్ల బిగించారు. టెక్నికల్ సిబ్బంది పంచాయతీలకు వచ్చి టెస్టింగ్ కూడా నిర్వహించగా.. తదనంతరం వాటిని పట్టించుకున్న నాథుడేలేడు. ప్రస్తుతం పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా.. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, నామినేషన్లు, ఎన్నికల నిర్వహణ, విజేతల ప్రకటన ఇలా ప్రక్రియ అంతా ఇంటర్‌నెట్ ద్వారానే జరగాల్సి ఉంది. గ్రామాల్లో ఫైబర్ సేవలు అందుబాటులో లేక మండల పరిషత్ కార్యాలయాలకు పంచాయతీ సిబ్బంది వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పైగా ఇంటర్‌నెట్ సేవలను ప్రారంభించకముందే విద్యుత్ మీటర్లు సైతం బిగించారు. దీంతో పంచాయతీల్లో వేలల్లో బిల్లులు చెల్లించాల్సి వస్తోంది.

రశీదులే దిక్కు..

పంచాయతీ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనంతో పాటు డిజిటల్ సేవలు అందించాలని గతంలో క్లస్టర్ల వారీగా ఆపరేటర్లను నియమించారు. కంప్యూటర్లు, ప్రింటర్లు అందించారు. గతంలో జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రభుత్వం ఇటీవల 11 పంచాయతీలను ఏర్పాటు చేసింది. పాత గ్రామ పంచాయతీల వారీగా జిల్లాలో సుమారు 120 మంది దాకా ఆపరేటర్లు విధుల్లో ఉన్నారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, నిధుల కేటాయింపు, ఆదాయ, వ్యయాలు, జీతభత్యాలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇంటి పన్ను తదితర సేవలను ప్రజలకు డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకొచ్చి ఇవ్వాల్సింది. టీ ఫైబర్ ద్వారా ఇంటర్‌నెట్ సేవలు ప్రారంభం కాకపోవడంతో ఈ ఆపరేటర్లు అంతా మండల పరిషత్ కార్యాలయాల్లోనే విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. పన్నులు, ఇతర రుసుములు చెల్లిస్తున్న వారికి కార్యదర్శులు చేతి రాత రశీదులను జారీ చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో టీ–ఫైబర్ సేవలు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పకడ్బందీగా పోలింగ్

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం
- విధులకు రెండు వేల మంది సిబ్బంది
- దూర ప్రాంతాల నుంచి బ్యాలెట్ బాక్సులు భద్రంగా తెచ్చేలా కార్యాచరణ
- వాహనాలకు నల్లగొండ జిల్లా పోలీసుల భద్రత
- ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోండి
- ఉపాధ్యాయ ఓటర్లకు రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి సూచన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రెండు వేల మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై ఆమె ‘సాక్షి’కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉండగా.. 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. దాదాపు 1100 మందిని ఎన్నికల నిర్వహణ కోసం కేవలం పోలింగ్ కేంద్రాల్లోనే ఏర్పాటు చేశాం. దాదాపు వేయి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో వెళ్లేటప్పటి నుంచి తిరిగి రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే వరకు పోలీసుల భద్రత ఉంటుంది. వాహనం వెంట సెక్యూరిటీ కూడా నల్లగొండ జిల్లా పోలీసులే ఉంటారు. ఆయా పోలింగ్ స్టేషన్లను బట్టి కొన్ని పెద్ద వాహనాలు, మరికొన్ని చిన్న వాహనాలు ఉపయోగిస్తున్నాం.

పోలింగ్ సమయం వరకు ఉండాల్సిందే..

కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 6 నుంచి 9 మంది వరకే ఓటర్లున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో కనిష్టంగా ఆరుగురు ఓటర్లున్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఒకటో పోలింగ్ స్టేషన్ ఉండగా నల్లగొండ జిల్లా గుడిపల్లిలో చివరి పోలింగ్ స్టేషన్ ఉంది. తక్కువ మంది ఓటర్లు ఉన్న కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం వరకే వంద శాతం పోలింగ్ పూర్తయినా సాయంత్రం 4 గంటల వరకు సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లోనే ఉండాలి.

27న ప్రత్యేక సెలవు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారికి ఈ నెల 27న పోలింగ్ సందర్భంగా ప్రత్యేక సెలవు ఇస్తున్నాం. దాంతో పోలింగ్ స్టేషన్లు ఉన్న కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాలకు కూడా సెలవు ప్రకటించాం.

బ్యాలెట్ బాక్సులను పంపుతాం. 26వ తేదీన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రాలకు వెళ్తారు. 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. పోలింగ్ అనంతరం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు సంబంధించిన అన్ని బ్యాలెట్ బాక్సులను నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొస్తాం. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో పొలిటికల్ ప్రజాప్రతినిధుల సమక్షంలో భద్రపరుస్తాం. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉంటుంది.

ఆర్జాలబావి గోదాం వద్ద రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూం

నల్లగొండ పట్టణ సమీపంలోని ఆర్జాలబావి వేర్ హౌజింగ్ గోదాముల్లో రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేశాం. అక్కడి నుంచే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు

ప్రలోభాలకు గురికావద్దు..

విద్యావంతులైన ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ఆయుధం. మనకు ప్రజాస్వామ్య బద్ధంగా ఎవరైతే సేవ చేస్తారో అలాంటి సమర్థులైన, సేవా భావం కలిగిన వారిని ఎన్నుకోవాలి.

భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను తరలిస్తాం

పోలింగ్ పూర్తయిన తర్వాత ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి పోలీస్ భద్రత నడుమ నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్సులను తరలిస్తాం. పోలింగ్ కేంద్రాల ఎన్నికల సిబ్బంది 27వ తేదీ రాత్రి వరకు రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్సులను తెస్తారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వాజేడు తదితర దూర ప్రాంతాల నుంచి వాహనాలు వచ్చేందుకు 28వ తేదీ ఉదయం వరకు సమయం పట్టవచ్చు. ఏ వాహనం కూడా పోలింగ్ స్టేషన్ నుంచి బయల్దేరిన తర్వాత మధ్యలో ఆపడానికి వీల్లేదు. వాహనాల రాకను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఏర్పాట్లు చేశాం.

మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో మార్చి 8న జరిగే జాతీయ మెగాలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి కోరారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీసులతో లోక్ అదాలత్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని, సూర్యాపేట ఏడవ స్థానంలో ఉందన్నారు. దానిని మెరుగుపర్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వెంకటరమణ, డీఎస్పీలు పాల్గొన్నారు.

పోలింగ్‌కు 300మంది పోలీసులతో బందోబస్తు

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



సూర్యాపేటటౌన్ : జిల్లాలో ఈ నెల 27న జరిగే ఖమ్మం–వరంగల్–నల్లగొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు 300మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 23 కేంద్రాల్లో పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సామగ్రికి రక్షణ, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రణాళిక ప్రకారం విధులు నిర్వర్తించాలని పోలీసు సిబ్బందికి, అధికారులకు సూచించారు. పోలీస్ పహారా నడుమ పోలింగ్ సామగ్రి తరలిస్తామని ఏమైనా ఇబ్బందులు వస్తే అధికారులతో పాటు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులకు సమాచార ఇవ్వాలని కోరారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు క్యూ లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు పోలింగ్ బూత్ అధికారి అనుమతి లేకుండా బూత్ లోకి వెళ్లవద్దని కోరారు. ఇతరులను పోలింగ్ బూత్ లోకి అనుమతించవద్దని సూచించారు. ఏడు రూట్‌లలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, 23 స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్, 8 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ బూత్ ల వద్ద స్టాటిస్టికల్ సిబ్బంది ఉంటారని, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్లు నిబంధనలు పాటించాలని కోరారు. ఓటరు గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని, క్యూ లైన్‌లో నిల్చొని ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు పోలింగ్ బూత్ లోకి అనుమతి లేదని తెలిపారు. 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ (144సెక్షన్) అమలులో ఉంటుందని తెలిపారు. పోలింగ్ బూత్ వద్ద 100 మీటర్ల, 200 మీటర్ల పరిధిలో ఎన్నికల నియమావళి ప్రకారం ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

ఎనిమిది నెలల క్రితం కోదాడ మున్సిపల్ పరిధిలోని కొమరబండ వద్ద ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనానికి చెందిన ఫెన్సింగ్‌ను కొందరు రాత్రికి రాత్రే తొలగించి ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. దీనిపై కోదాడ మున్సిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ, నేటి వరకు నిందితులనే గుర్తించలేదు.

ఆరు నెలల క్రితం కొమరబండ వై జంక్షన్ వద్ద ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించారు. దీంతో కోదాడ ఆర్డీఓ వెంటనే దానిచుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించి ఇది ప్రభుత్వ భూమి.. ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని బోర్డు పెట్టించారు. దీనిని కొందరు రాత్రికిరాత్రే తొలగించి ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశారు.పోలీసులకు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినా కనీస చర్యలు లేవు.

ఫిర్యాదులు.. బుట్టదాఖలు!

- కోదాడలో ఆగని ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- అధికారులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని పోలీసులు
- ఇదే అదునుగా రెచ్చిపోతున్న అక్రమార్కులు



కోదాడ పట్టణం నడిబొడ్డున ఉన్న వ్యవసాయ శాఖ గోదామును కొందరు ఆక్రమించి నివాసం ఉంటున్నారు. వారు పది రోజుల క్రితం గోదాము రేకులను తొలగించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించారు. దీనిపై కోదాడ ఏడీఏ ఈ నెల 18న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ, పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.

కోదాడ: కోదాడ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో పోలీస్ అధికారులు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలపై వస్తున్న ఫిర్యాదులను ఖాకీలు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. దీంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారనే వాదనలు బలంగావినిపిస్తున్నాయి. రెండు నెలల క్రితం కోదాడ పట్టణానికి చెందిన ఓ మాజీ కౌన్సిలర్.. మెప్మా ఆర్‌పీతో కుమ్మక్కై మహిళా స్వయం సహాయక సంఘాలకు చెందిన 10 లక్షల రూపాయల రుణం తీసుకొని సభ్యులకు పంచలేదు. దీనిపై సమభావన సంఘం సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. మీ శాఖ అధికారులు ఇస్తేనే ఫిర్యాదు తీసుకుంటామని పోలీసులు సమభావన సంఘం సభ్యులను వెనక్కి పంపింపడం గమనార్హం.

ప్రజాప్రతినిధులకు సమస్యలు చెప్పుకోకుండా..

కోదాడలో ముఖ్య ప్రజాప్రతినిధులకు ప్రధాన అనుచరులుగా చెప్పుకుంటున్న కొందరి మాటే చెల్లుబాటు అవుతోందని వారిచెప్పినట్లే పోలీసులు నడుచుకుంటున్నారని అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు సామాన్యులు తమ సమస్యలు చెప్పుకోకుండా వీరు అడ్డుగోడల్లా ఉంటూ పెత్తనం చెలాయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఫలానా పోలీస్ అధికారికి తామే ఇక్కడ పోస్టింగ్ ఇప్పించామని, ఫలానా అధికారిని ఇక్కడి నుంచి తామే పంపించామని చెప్పుకుంటూ పోలీసులతో అంటకాగుతూ జోరుగా పైరవీలు చేస్తున్నట్లు సమాచారం.

పోలీసుల వాదన మరోలా..

ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించిన వారు, వాటిని ధ్వంసం చేసినవారెవరో అందరికీ తెలిసినప్పటికీ ఫిర్యాదులో మాత్రం గుర్తుతెలియని వ్యక్తులని పేర్కొన్నడం ఏమిటని పోలీసులు అంటున్నారు. ఫిర్యాదు నిర్దిష్టంగా ఉంటే చర్యలు తీసుకోవడం వీలవుతుందని పోలీసులు చెబుతున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



హుజూర్‌నగర్ : సామూహిక జన్మదిన వేడుకల్లో ప్రభుత్వ పెన్షనర్లు

హుజూర్‌నగర్ : పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య కోరారు. మంగళవారం హుజూర్ నగర్‌లోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో సంఘ సభ్యుల సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెల్త్ కార్డులు సాధించేందుకు పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల చివరినాటికి ఉద్యోగ విరమణ చేసిన వారికి అన్ని బెనిఫిట్స్ అందే అవకాశం ఉందన్నారు. వచ్చే నెల 16,17,18 తేదీల్లో కోదాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు పెన్షనర్ల ఐక్యతకు నాంది పలకాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సుదర్శన్ రెడ్డి, రాంబాబు, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు సోమయ్య, నాయకులు కో టయ్య, దేవదానం, ఎన్. వెంకటేశ్వరరావు, కేవీఎస్ మూర్తి, వి. వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, చంద్రయ్య, ధర్మారి వెంకటేశ్వర్లు, టి. ప్రభాకర్ రెడ్డి, జి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ లైన్‌మెన్‌పై దాడి

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీలోని తంగడపల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్ లైన్‌మెన్‌పై దాడి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ లైన్‌మెన్ రాంరెడ్డి రోజుమాదిరిగానే మంగళవారం విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నాడు. గ్రామంలోని దేశగోని మల్లేష్ వద్దకు వెళ్లి బకాయి బిల్లు చెల్లించాలని కోరాడు. దీంతో మల్లేష్ లైన్‌మెన్ రాంరెడ్డిపై దాడి చేశాడు. లైన్‌మెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఆలయంలో దేవుళ్ల విగ్రహాలు చోరీ

మోత్కూరు: మోత్కూరు మండలం దాచారం గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ గర్భగుడి తాళాలను సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి విలువైన దేవుళ్ల విగ్రహాలను ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయంలోని చోరీ జరిగినట్లు గుర్తించి పూజారి శ్రీనివాసాచార్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాముడు, సీత, లక్ష్మణుడు, రంగనాథస్వామి దేవతామూర్తుల విగ్రహాలను అపహరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

జాతీయ రహదారిపై కంటైనర్ లారీ బోల్తా



చౌటుప్పల్: బోల్తా పడిన కంటైనర్ లారీ

చౌటుప్పల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో మంగళవారం రాత్రి కంటైనర్ లారీ బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కంటైనర్ లారీ చౌటుప్పల్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రాగానే అదుపుతప్పి హైవే పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటన జరిగిన సమయంలో సర్వీసు రోడ్డులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్‌కు సైతం ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బోల్తా పడిన లారీని పక్కకు తొలగించారు.

గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్..

నడిగూడెం: నడిగూడెం మండలం వేణుగోపాలపురంలో మంగళవారం గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ బోల్తా పడింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడికి వాటర్ ట్యాంకర్ తాళం ఇవ్వడంతో అతడు ట్యాంకర్ నడుపుతుండగా ఎదురుగా మలుపు ఉండడంతో దానిని తప్పించబోయే క్రమంలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

చేతబడి నెపంతో వ్యక్తిపై హత్యాయత్నం

- నిందితుడి అరెస్ట్

చివ్వెంల(సూర్యాపేట): చేతబడి చేశాడనే నెపంతో వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని జి.తిర్మలగిరి గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చివ్వెంల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జి.తిర్మలగిరి గ్రామ పంచాయతీకి చెందిన మోతె హనుమంతు ఈ నెల 21వ తేదీ సాయంత్రం గ్రామంలోని బ్రిడ్జి కింద ఉన్న గుంతలో చేపలు పడుతుండగా.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మోదిన్‌పురం గ్రామానికి చెందిన రేవల్లి మహేష్ తనకు హనుమంతు చేతబడి చేశాడనే అనుమానంతో అతడిపై దాడి చేసి బీరు సీసాతో గొంతు కోసి, బురదలో తొక్కి అక్కడ నుంచి పరారయ్యాడు. బాధితుడి కుమారుడు దశరథ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చివ్వెంల ఎస్‌ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హనుమంతుపై హత్యాయత్నానికి పాల్పడిన రేవల్లి మహేష్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ముస్తాబైన శైవ క్షేత్రాలు

మహాశివరాత్రి పర్వదినానికి ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆయా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



సూర్యాపేట మండలం పిల్లలమర్రిలోని శివాలయం



నాగార్జునసాగర్ జలాశయం మధ్యన గల ఏలేశ్వరం దేవాలయం వ్యూ



మిర్యాలగూడ: యాద్గార్‌పల్లిలోని చెన్నకేశవస్వామి-అగస్త్యేశ్వరస్వామి ఆలయం



మునగాలలో ముస్తాబైన వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం



సూర్యాపేటటౌన్: పిల్లలమర్రిలోని త్రికూటేశ్వర ఆలయం

కారును ఢీకొట్టిన ఇసుక లారీ

- మహిళకు తీవ్ర గాయాలు

శాలిగౌరారం: కారును ఇసుక లారీ ఢీకొట్టడంతో మహిళకు గాయాలయ్యాయి. ఈ ఘటన శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామ సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. హన్మకొండ పట్టణానికి చెందిన ఎం. రామ్‌ధన్ తన భార్య లక్ష్మితో కలిసి కారులో 365వ నంబర్ జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా.. శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామ సమీపంలో కారును ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా కారులో ఉన్న లక్ష్మికి తీవ్ర గాయాలు, రామ్‌ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కొద్ది దూరంలో పోలీస్ ఔట్‌పోస్టులో ఉన్న పోలీసులు ప్రమాదాన్ని గమనించి ఘటనా స్థలానికి చేరుకొని 108 సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అర్వపల్లికి చెందిన 108 వాహనంలో బాధితులను సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

టిప్పర్ అదుపుతప్పి ఇద్దరు కూలీలు మృతి

- మరొకరి పరిస్థితి విషమం
- మృతులు మధ్యప్రదేశ్ వాసులు



ప్రహలాద్‌సింగ్ మృతదేహం



సందీప్‌సింగ్ మృతదేహం

ఆలేరురూరల్: క్వారీ లోపలికి వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరు వలస కూలీలు మృతిచెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఆలేరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం శాదోల్ జిల్లా, మావూ గ్రామానికి చెందిన ప్రహలాద్ సింగ్(19), సందీప్ సింగ్(19), లోకేష్ ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామంలోని శ్రీవెంకటేశ్వర క్రషర్‌లో కొన్ని నెలలుగా పనిచేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి రాయి లోడింగ్ కోసం వీరు ముగ్గురు కలిసి టిప్పర్‌లో 70 అడుగుల పైనుంచి పక్కనే ఉన్న క్వారీలోకి వెళ్తుండగా.. టిప్పర్ అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో టిప్పర్ నడుపుతున్న ప్రహలాద్ సింగ్, సందీప్‌సింగ్ అక్కడికక్కడే మృతిచెందారు. లోకేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అయితే క్వారీ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే మృతదేహాలను రాత్రికి రాత్రే భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లోకేష్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. లోకేష్ పరిస్థితి విషయంగా ఉందని ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అయితే శ్రీవెంకటేశ్వర క్రషర్ యాజమాన్యం అనుమతి పొందిన దానికంటే ఎక్కువ లోతుకు క్వారీని తవ్వినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

చివ్వెంల(సూర్యాపేట): కిరాణా దుకాణంలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.30వేల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన ఎండీ చాంద్‌పాషా స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షట్టర్ తాళం పగులగొట్టి కిరాణ సామగ్రితో పాటు మద్యం సీసాలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం చోరీ జరిగినట్లు తెలుసుకున్న చాంద్‌పాషా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

- మరో ఉపాధ్యాయుడికి తీవ్రగాయాలు



హోండా యాక్టీవాను ఢీకొట్టిన గూడ్స్ వాహనం

కోదాడ రూరల్ : హోండా యాక్టీవాను గూడ్స్ వాహనం ఢీకొట్టడంతో ప్రైవేట్ టీచర్ మృతిచెందాడు. మరో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ వద్ద మంగళవారం జరిగింది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన మంత్రిప్రగడ కనకేశ్వరశర్మ(55), కుక్కడపు పుల్లయ్య ప్రైవేట్ పాఠశాలలో టీచర్లుగా పనిచేస్తున్నారు. ఇద్దరు కలిసి మంగళవారం యాక్టీవాపై కొమరబండకు వెళ్లి తిరిగి కోదాడకు వస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి కోదాడ వైపు వెళ్తున్న టాటా ఏస్ గూడ్స్ వాహనం కొమరబండ వద్ద యాక్టీవాను వెనుక ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కనకేశ్వరశర్మ అక్కడికక్కడే మృతిచెందాడు. పుల్లయ్యకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం అతడిని కోదాడకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి సోదరుడు శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



రుద్ర హవనం నిర్వహిస్తున్న అర్చకులు



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మూడో రోజు ఉదయం ఆలయంలో రుద్ర హవనములు, శివపంచాక్షరీ జపములు, నందీశ్వర పారాయణములు, పంచసూక్త పఠనములు, మూలమంత్ర జపములు, వివిధ పారాయణములను పారాయణీకులు గావించారు. సాయంత్రం స్తోత్ర, వేద, నమక, చమక పారాయణములు, మంత్ర పుష్ప పఠనములు, సోమకుంభార్చనలు, మూలమంత్ర పారాయణాలు నిర్వహించారు. శివాలయంలోని కల్యాణ మండపంలో రాత్రి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో ముస్తాబు చేసి ప్రత్యేక పల్లకీలో ఊరేగించుకుంటూ కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అనంతరం కల్యాణ తంతు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ ప్రధాన పూజారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఆలయంలో అభిషేకాలు, రాత్రి మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున్న అధికారులు ఏర్పాట్లు చేశారు.

కమ్యూనిస్టుల పోరాటంలో భాగస్వాములు కావాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వలిగొండ : ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు చేసే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో కమ్యూనిస్టులకు మంచిరోజులు రానున్నాయని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు కొమ్ముకాసే నాయకులపై విసిగిపోయిన ప్రజలు.. కమ్యూనిస్టు పాలన కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, యాదాద్రి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, బూర్గు కృష్ణారెడ్డి, జల్లెల పెంటయ్య, గుంటోజు శ్రీనివాసాచారి, సిర్పంగి స్వామి, మద్దెల రాజయ్య, పైళ్ల గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో వరిచేనుకు నీరు



ఆత్మకూరు(ఎం) మండలం కూరెల్ల గ్రామ రైతు సూదగాని ఆగయ్య యాసంగిలో రెండెకరాల్లో వరి సాగుచేశాడు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు పోయక.. పంట ఎండిపోయే దశకు వచ్చింది. పొలాన్ని కాపాడుకోవడానికి ఆగయ్య రోజుకు రూ.1000 వెచ్చించి ట్యాంకర్‌లో నీటిని తెప్పించి పొలానికి పడుతున్నాడు. ఇప్పటికే ఆరు ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేశానని, ఇంకా నెల పాటు పొలాన్ని కాపాడుకోవాల్సి ఉంటుందని ఆగయ్య చెప్పాడు. - ఆత్మకూరు(ఎం)

కట్టమూరు వద్ద మిర్చి కూలీల ఆటో బోల్తా

- 8 మందికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం
- బాధితులు సూర్యాపేట జిల్లా కూలీలు



బోల్తా కొట్టిన ఆటో

సత్తెనపల్లి: మిర్చి కూలీల ఆటో బోల్తా కొట్టిన సంఘటన ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కట్టమూరు–గోరంట్ల మధ్య మంగళవారం జరిగింది. సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామానికి చెందిన రైతులు నందిగం సాగర్, నందిగం వెంకటేష్‌లు నెల క్రితం తెలంగాణలోని సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కుడకుడ గ్రామానికి చెందిన కూలీలను మిరప కోతల నిమిత్తం తీసుకువచ్చారు. వారు కట్టమూరు సమీపంలో తాత్కాలిక నివాసాలు ఏర్పరచుకొని మిరపకాయలు కోసేందుకు కూలి పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కట్టమూరు నుంచి 20 మంది కూలీలు ఆటోలో గోరంట్ల గ్రామానికి వెళుతుండగా ఆటో ఒక్కసారిగా బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో 8 మందికి గాయాలయ్యాయి. వీరిలో శ్రీపాటి వెంకన్నకు పరిస్థితి విషమించడంతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మిగిలిన వారిలో వెంకటేష్, సతీష్ కుమార్‌తో పాటు మరో ఐదుగురికి స్వల్ప గాయాలు కావడంతో స్థానిక ఏరియా వైద్యశాలలో చికిత్స అందించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం తరలింపు కేసులో ముగ్గురు అరెస్ట్

- పరారీలో మరో నలుగురు
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు


మిర్యాలగూడ అర్బన్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్న ముగ్గురిని విజయపురి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో డీఎస్పీ కె. రాజశేఖర రాజు విలేకరులకు వెల్లడించారు. తిరుమలగిరి మండలం సిల్గాపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ వనమాల నరసింహ, గరికేనట్‌తండాకు చెందిన మరో రేషన్ డీలర్ సపావత్ విజయ్, చింతలపాలెం గ్రామానికి చెందిన చింతల నాగరాజు, నాయకునితండాకు చెందిన దేవుజ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దుర్గికి చెందిన తిరువాయిపాటి వెంకటేశ్వర్లు, శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, దాట్ల బ్రహ్మంరాజు ముఠాగా ఏర్పడి కొద్ది నెలలుగా రేషన్ బియ్యాన్ని ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సోమవారం మధ్యాహ్నం ఐచర్ వాహనంలో రేషన్ బియ్యాన్ని లోడ్ చేసుకుని ఆంధ్రాకు తరలిస్తుండగా.. నాగార్జునసాగర్‌లోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి వాహనంలోని ఓ వ్యక్తి పారిపోతుండగా.. అనుమానం వచ్చిన పోలీసులు వాహనాన్ని పరిశీలించారు. అందులో 39.50 క్వింటాళ్ల (80బస్తాల) రేషన్ బియ్యాన్ని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి వనమాల నరసింహ, తిరువాయిపాటి వెంకటేశ్వర్లు, దాట్ల బ్రహ్మంరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి ఐచర్ వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సాగర్ సీఐ బీసన్న, ఎస్‌ఐలు సంపత్, వీరశేఖర్, వీరబాబు ఉన్నారు.

వేరుశనగ సాగులో మెళకువలు

- పెద్దవూర ఏఓ సూచనలు



పెద్దవూరలో సాగవుతున్న వేరుశనగ



పెద్దవూర: ప్రస్తుత సీజన్‌లో వేరుశనగ పంట పూత దశలో ఉంది. ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తుండటంతో వేరుశనగ పంటకు చీడపీడలు ఆశిస్తున్నాయి. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వేరుశనగ సాగు చేసే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ సూచిస్తున్నారు. వేరుశనగ సాగులో మెళకువలు ఆయన మాటల్లోనే..

పచ్చపురుగు బెడద : రబీలో శనగపచ్చ పురుగు బెడద అధికంగా ఉంటుంది. మార్చి నెల వరకు ఈ పురుగుల ఉధృతి ఉంటుంది. ఆకుల వెనక రెక్కలు పాలిపోయిన తెలుపు రంగుతో నల్లని అంచు కలిగి ఉంటాయి. గుడ్డు లేదా దాని నుంచి వెలువడిన పిల్ల పురుగులు లేదా ఆకుపచ్చ రంగులో పెరిగిన పురుగులు ముదురు ఆకుపచ్చ రంగు నుంచి గోధుమ రంగులోకి మారతాయి. నల్లని తల ఉన్న చిన్న పురుగులు హరితాన్ని పువ్వు మొగ్గలు, రేకులను గీకి తింటాయి. తర్వాత మొగ్గలు, పువ్వులు కాయలను తొలిచి తిని డొల్ల చేస్తాయి. ఒకే పురుగు చాలా కాయలను నష్టపరుస్తుంది. వేరుశనగ పంట లేతగా ఉన్నప్పుడు ఇవి ఆకులను తిని నాశనం చేస్తాయి. కాయలకు గుండ్రటి రంధ్రాలు చేసి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తాయి. సమగ్ర యాజమాన్య పద్ధతులతో ఈ పురుగును నివారించవచ్చు. ఎకరానికి నాలుగు నుంచి ఐదు లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. గుడ్లు, చిన్న పురుగుల నివారణకు ఐదు శాతం వేపనూనెను పంటకు పిచికారీ చేయాలి. ఎన్‌పీవీ ద్రావణాన్ని(వైరస్ ద్రావణం) ఎకరానికి 250 ఎల్‌ఈ తగినంత నీటిలో కలిపి సాయంత్రం పిచికారీ చేయాలి.

ఆకుపచ్చ తెగులు : పంట వేసిన 30 రోజుల నుంచి ఈ తెగులు కనిపిస్తుంది. ఈ తెగులు సోకితే వేరుశనగ ఆకు పైభాగాన ముదురు గోధుమ రంగు కలిగి ఉంటాయి. తెగులు కన్పించిన వెంటనే ఎకరాకు 400 గ్రాముల మాంకోజెబ్ లేదా హెక్సాకొనాజోల్ 400 మిల్లీలీటర్లు లేదా కార్బన్‌డిజం 200 గ్రా. చొప్పున 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

వేరుశనగలో సూక్ష్మ పోషకాలు

వేరుశనగ మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషక పదార్థాలు అవసరం. వీటిలో కాల్షియం, సల్ఫర్, జింక్, ఇనుము. ఇవి మొక్కలకు తగినంత అందనప్పుడు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

కాల్షియం : మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే ఎంజైములను ఉత్తేజపర్చడానికి, వేర్ల అభివృద్ధికి కాల్షియం బాగా తోడ్పడుతుంది. తాలు కాయలు ఏర్పడకుండా గింజలు లావుగా ఉండి కాయ నాణ్యత పెరిగేందుకు దోహదం చేస్తుంది. కాల్షియం లోపిస్తే వేరుశనగ మొక్క వేరు చివరి భాగం నశించి పెరుగుదల ఆగిపోతుంది. ఆకుల్లో పచ్చదనం లోపిస్తుంది. ఆకుల కాండం విరుగుతుంది. కంచు రంగుకు మారి చిగుర్లు వంకరలు తిరుగుతాయి. వేర్ల అభివృద్ధి దెబ్బతిని బుడిపెల సంఖ్య తగ్గుతుంది. కాల్షియం లోపం నివారణకు ఎకరాకు 200 కిలోల జిప్సమ్‌ను విత్తిన 40 రోజులకు మొక్క మొదళ్ల దగ్గరికి ఎగదోయాలి. ఆ తర్వాత నీరు పెట్టాలి.

గంధకం : గంధకం వేరుశనగలో నూనె శాతం పెరగడానికి, కాయలు మంచి రంగును కలిగి ఉండేందుకు, కాయ గింజ బరువు పెరగడానికి దోహదపడుతుంది. నేల నుంచి నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను ఎక్కువ పరిమాణంలో మొక్క తీసుకోవడానికి గంధకం దోహదం చేస్తుంది. ఊడల నుంచి కాయలు తెగిపోకుండా కాపాడుతుంది. వేర్లలో రైజోబియం బుడిపెలు ఏర్పడడానికి సహకరిస్తుంది. గంధకం లోపిస్తే ఆకుల ఈనెలు పసుపు రంగుకు, లేత ఆకులు పసుపుపచ్చగా మారతాయి. ముదురు ఆకులు మార్పు లేకుండా ఆకుపచ్చగా ఉంటాయి. వీని నివారణకు అమ్మోనియం సల్ఫేట్, సూపర్ ఫాస్ఫేట్, పొటాషియం సల్ఫేట్ వంటి ఎరువులు వాడాలి. గింజల్లో నూనె శాతం పెరగడానికి విత్తిన 40 రోజులకు జిప్సం వాడాలి.

ఇనుము : వేరుశనగ మొక్కల్లో ఇనుము లోపం ఉన్నప్పుడు ఆకులు పసుపుపచ్చగా మారతాయి. తర్వాత ఆకు మొత్తం పసుపు రంగుకు మారుతుంది. లేత ఆకులు సన్నగా, నిటారుగా పసుపు రంగుకు మారి పసుపు రంగు కోల్పోయి తెలుపు రంగుకు మారతాయి. ముదురు ఆకులు ఎండి రాలిపోతాయి. ఇనుము లోపం వలన కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడుతుంది. పంట ఎదుగుదల ఆగిపోయి దిగుబడి 30–40 శాతం తగ్గుతుంది. దీని నివారణకు ఐదు గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ ఒక గ్రాము సిట్రిక్ ఆమ్లం కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ద్రావణాన్ని ఎప్పటికప్పుడు కలుపుకుంటూ పిచికారీ చేయాల్సి ఉంటుంది.